

డ్రైనేజీ సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

వనస్థలిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో కాలనీలో అన్నివిధాల అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామని, కేవలం ఒక రోడ్డు ఎత్తు పల్లాలు సరిలేకపోవడంతో డ్రైన్స్ ఔట్‌లెట్ లేక చిన్నపాటి వర్షానికే వర్షపునీరు నిలుస్తుందన్నారు. ఆ డ్రైన్స్ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ రోడ్డు వెనుకాల ఒక ప్రైవేట్ స్థలం ఉన్న నేపథ్యంలో ఆ స్థల యజమానులను పిలిపించి నూతన డ్రైన్స్ నిర్మాణపు పనులకు వారిని ఒప్పించి తగు పరిష్కారం చేపడుతామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, మిట్టా రామ్మోహన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కాపాడండి

హయత్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ రెవెన్యూ పరిధిలో భూ భారతి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తుర్కయంజాల్, మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు కాపాడాలని కోరుతూ సీపీఎం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి డి. కిషన్ వినతిపత్రం సమర్పించారు. ఇంటి స్థలాల కోసం పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, ఆశీర్వాదంతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: రాగుల

వనస్థలిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్‌కాలనీ, హస్తినాపురం ఈస్ట్ ఫేజ్-1 కాలనీలో శుక్రవారం సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ల సహకారంతో డివిజన్‌లోని సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి గ్రేటర్‌లో ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్రిస్టియన్‌కాలనీ అధ్యక్షుడు హరిందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజమల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, భూపతిరెడ్డి, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

వనస్థలిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో సీసీ రోడ్డు, వీధిలైట్లు, పార్కుల్లో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు, నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు తదితర సమస్యల పరిష్కారానికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరు తూ శుక్రవారం జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు.



ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్స్, లక్నోచికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్‌గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతరఅనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్ అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

వరద కాల్వ పనుల పరిశీలన

కొత్తపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వరద నీటి కాల్వ నిర్మాణంతో కొత్తపేట మోహన్‌నగర్ వరద నీటి సమస్యలు పరిష్కారమవుతాయని కార్పొరేటర్ పవన్ కుమార్ తెలిపారు. మోహన్‌నగర్‌లో రూ.52లక్షలతో చేపట్టిన వరదనీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీటి కాల్వ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ షరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాలనీ ప్రతినిధులు వినోద్‌కుమార్, ప్రవీణ్, రాజశేఖర్, రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభం

మన్సూరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నాగోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం అధికంగా ఉన్నందున వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా దాత రాకేష్ అగర్వాల్ సహకారంతో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో అదనపు గదుల నిర్మాణపు పనులను ఆయన కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించడంతో పాటు ఒకటో తరగతి విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సుజాతానాయక్ శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, నిధులు మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో రహదారి నిర్మాణ పనులు, ఎస్ఎన్‌డీపీ కింద నాలా నిర్మాణ పనులకు నిధులు మంజూరైనట్లు, ఆ పనులను త్వరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.



పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు



సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి



చంచల్‌గూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కాలాడేరలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న డిప్యూటీ ఈవో రాధాకృష్ణ



హెచ్ఎం బత్తుల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జైపురికాలనీ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రామారావు, కార్పొరేటర్ చింతల అరుణ

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

మన్సూరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు, సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఉప్పల్ ఎంఈఓ రామారావు పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీతో పాటు చిన్నారులచే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అక్షరాభాస్యం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ రామారావు, స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మీలు విచ్చేసి పుస్తకాలు అందజేసి అక్షరాభాస్యం చేయించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మంజులారెడ్డి, పద్మజారెడ్డి, ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీబ్యూల, గాయత్రి, లలిత, మేఘమాల పాల్గొన్నారు.

బాటసింగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని బాటసింగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి సారి పాఠశాలకు హాజరైన విద్యార్థులతో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం యాదగిరి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంతోష, ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ్య, పుష్ప, పార్వతి, కవిత, మాజీ వార్డు సభ్యుడు ఎర్రవెల్లి మారుతిప్రసాద్, గోపి, పెంటయ్య, నవీన్, రాజు పాల్గొన్నారు.



పిల్లలతో అక్షరాలు దిద్దిస్తున్న ప్రధానోధ్యాయులు ఆంజనేయులు, టీచర్లు, కాలనీ ప్రతినిధులు

మోహన్‌నగర్‌లోని పాఠశాలలో..

కొత్తపేట : బడిఈడు పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన శిక్షణ పొందిన టీచర్లు విద్యా బుద్ధులు నేర్పుతారని కొత్తపేట మోహన్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు అన్నారు. ప్రొ.జయశంకర్ బడిబాటలో భాగంగా శుక్రవారం పాఠశాలలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లల తల్లి దండ్రులు, టీచర్లు, మోహన్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గజేంద్ర సింగ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీచర్లు సునీత, అరుణజ్యోతి, సంధ్య. అంజనాదేవి, శైలజ పాల్గొన్నారు.



చాదర్‌ఘాట్‌లోని ప్రభుత్వ సిటీ మోడల్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

బండ్లగూడలోని ఎంపీపీ పాఠశాలలో..

నాగోల్ డివిజన్ బండ్లగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అన్నమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ ఎం.అరుణ, బండ్లగూడ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరువు భవానీశంకర్‌గౌడ్, సభ్యులు తూర్పాటి నారాయణ, మెట్టు మురళిగౌడ్, సురేష్‌గౌడ్, నాగేల్లి సహదేవ్ గౌడ్, పంగ గౌతమ్, కందికంటి రాఘవేంద్రగౌడ్ పాల్గొన్నారు.



బండ్లగూడ గ్రామంలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న హెచ్ఎం అన్నమ్మ, చెరుకు భవానీశంకర్‌గౌడ్

గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో..

సైదాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన లభిస్తుందని కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనేక సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లతారాణి, ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాధిక, మాధురీ, లత పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్షార్హులు

- **రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీవాణి**

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం శిక్ష తప్పదని రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి పి. శ్రీవాణి హెచ్చరించారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి సురక్ష సేవా సంఘం, హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి శ్రీవాణి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను తప్పకుండా వారి తల్లిదండ్రులు స్కూల్‌లో చేర్పించాలని సూచించారు. రాచకొండ కమిషనరేట్ ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు నేరాల బాట పట్టకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర గోపీశంకర్‌యాదవ్, టీపీసీసీ లీగల్ చైర్మన్ భిక్షపతిగౌడ్, హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోడెం ప్రభాకర్, బండి నరేష్, సతీష్, సంతోష్‌గౌడ్, ఎస్ఐ మాధవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి


వర్షపునీరు నిల్వకుండా ప్రణాళికలు రూపొందించండి

- **జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్**

మన్సూరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వర్షపునీరు నిల్వకుండా ప్రణాళికలు రూపొందించి వరదనీరు చిన్నచెరువులోకి వచ్చి చేరేలా చూడాలని సంబంధిత అధికారులను జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులు, సమస్యలను స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి శుక్రవారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ జడ్జెస్‌కాలనీ ఫేజ్-1లో గల హిందూ శ్మశానవాటికను మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. వర్షం కురిస్తే కేబీఆర్ కన్వెన్షన్ గుండా కాస్మోపాలిటన్‌కాలనీ, వీకర్‌సెక్షన్‌కాలనీల మీదుగా ప్రవహిస్తూ ఉంటోందని, రూ.80లక్షలతో స్టార్మ్‌వాటర్ డ్రైన్ నాలాను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మన్సూరాబాద్ మెయిన్‌రోడ్డులోని ఆయిల్ మిల్ వద్ద బాక్స్‌డ్రైన్ నాలా సామర్థ్యాన్ని పెంచి పాత నాలాను తొలగించి రూ.95.50లక్షలతో స్టార్మ్‌వాటర్ డ్రైన్ నాలాను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఇంజనీరింగ్ శాఖ ఈఈ రమేష్‌బాబు, డీఈ కనకయ్య, ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, ఇరిగేషన్ ఏఈ సతీష్, డీఈ నీలిమ, సిబ్బంది, నాయకులు హరీష్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.



కార్పొరేటర్ నర్సింహారెడ్డి, అధికారులతో కలిసి మన్సూరాబాద్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్



నీరు నిలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆలయ ఈఓ లావణ్య

ముఖద్వారం వద్ద నీరు నిలువకుండా చర్యలు : ఈఓ

చంపాపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ ప్రధాన ముఖద్వారం ముందు వర్షం నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.లావణ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కర్మన్‌ఘాట్ ఆలయంలోకి వర్షపు నీరు అనే వార్తకు ఈవో స్పందించారు. ఆలయ ముఖద్వారం ముందు నీరు నిలుస్తున్న ప్రదేశంను ఈఓ పరిశీలించారు. జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం డ్రైన్‌లైన్‌లోకి సాఫీగా నీరు వెళ్లేందుకు పైపులు, మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఆ ప్రదేశంలో నీరు నిలువకుండా ఎత్తు పెంచేందుకు సీసీ రహదారిని రెండు, మూడు రోజుల్లో వేయించనున్నట్లు ఈఓ తెలిపారు.

అమ్మమాట- అంగన్‌వాడీ బాట

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ శ్రీరాంనగర్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీస్కూల్‌లో చేర్పించడానికి విద్యార్థులతో కలిసి కాలనీలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ కళ్యాణి, అంగన్‌వాడీ టీచర్ స్వప్న పాల్గొన్నారు.

30 వరకు రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ

- **డీసీఎస్‌వో వనజాతారెడ్డి వెల్లడి**
- **వదంతులు నమ్మొద్దని సూచన**



సరూర్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి వనజాతారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం బాలాపూర్‌లోని రేషన్‌షాపును సందర్శించిన ఆమె మాట్లాడుతూ ఈ సారి మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నందున తమకు బియ్యం దొరుకుతుందో లేదోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారని, ఎవరికీ ఎలాంటి ఆందోళన అవసరం లేదని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ నెలాఖరు వరకు షాపుల్లో సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ ఉంటుందంటూ జరుగుతున్న పుకార్లు నమ్మవద్దని, ఈ నెలంతా బియ్యం పంపిణీ కచ్చితంగా జరుగుతుందని వనజాతారెడ్డి తెలిపారు. వదంతులు నమ్మి ఒకేసారి షాపుల వద్దకు గుంపులుగా రావాల్సిన అవసరం లేదని, నెలాఖరు దాకా ఎప్పుడైనా సరకులు తీసుకోవచ్చని ఆమె చెప్పారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం బాలాపూర్ మండల అధ్యక్షుడు టేకుల శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్ల ఫీజు దోపిడీని అరికట్టాలి

- **బాలాపూర్ ఎంఈవోకు బీజేపీ నేతల వినతి**

సరూర్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పేద, మధ్య తరగతి వర్గాల నుంచి అధిక మొత్తంలో ముక్కు పిండి మరీ ఫీజులు వసూలు చేస్తున్నాయని, అలాంటి స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు అధికారులను కోరారు. ఈ మేరకు మండలంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పలు పాఠశాలల పేర్లతో కూడిన ఫిర్యాదును శుక్రవారం బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు బాలాపూర్ ఎంఈవోకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలకు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, దాంతో వాటి యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయం ప్రాంతంలో ఓ వైన్స్ సమీపంలోనే పాఠశాల ఏర్పాటు చేశారని అసలు దానికి అనుమతి ఎలా ఇచ్చారని వారు ప్రశ్నించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలను అరికట్టి, అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, నవారు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, కళ్లెం లక్ష్మారెడ్డి, మంగపతినాయక్, మహేందర్, అరవింద్ పాల్గొన్నారు.



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేత రామకృష్ణారెడ్డి

కోర్టు వివాదాల్లో ఉన్న భూముల్లో జోక్యమా?

- **పోలీసు, రెవెన్యూ అధికారులపై హైకోర్టు ఆగ్రహం**

హైదరాబాద్ : కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూవివాదాల్లో అతిగా జోక్యం చేసుకుంటున్నారంటూ రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. శాంతిభద్రతల సమస్య, వివాదాల పరిష్కారం, భూముల గుర్తింపు(లోకలైజేషన్), టైటిల్ లేదా యాజమాన్య హక్కులు నిర్ధారించడం పేరుతో జోక్యం చేసుకోవడాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించబోమని స్పష్టంచేసింది. భూముల రికార్డులు, రెవెన్యూ సంబంధిత అంశాలను నిర్ధారించడం వరకే తహసీల్దార్ల పని అని.. అంతకుమించి ముందుకు వెళ్లే అధికారం లేదని స్పష్టంచేసింది. యాజమాన్య హక్కులు, పొజిషన్, టైటిల్‌ను నిర్ణయించే హక్కు కేవలం సివిల్‌కోర్టుకు మాత్రమే ఉందని స్పష్టంచేసింది. సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని సర్వే నెంబర్ 60లోని 400 చదరపు గజాల ప్లాటు సర్వే నెంబర్ 60లో కాదు.. సర్వే నెంబర్ 58 లో ఉందని పేర్కొంటూ తహసీల్దార్ పీ వేణుగోపాల్ ఆదేశాలివ్వడాన్ని సవాల్ చేస్తూ బీ బుజ్జి అనే మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వివాదం సివిల్ కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తహసీల్దార్ నిర్ణయం తీసుకోవడం.. మీర్‌పేట్ పోలీసులు ఇతరులను భూమిలోకి అనుమతించడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. 'మీకు అధికారాలు ఇచ్చింది దందాలు చేయడానికి కాదు మీరు కోర్టు కంటే అధికులమని భావిస్తున్నారా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి ఇలాంటి ఘటనల్లో పాలుపంచుకుంటే జీతభత్యాలు నిలిపేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాలను కొట్టేసింది.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఓల్డమలక్‌పేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగులకు కొత్త పథకాలు ప్రవేశపెడుతూ వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయ ఉపకరణాల వైకల్య శాతాన్ని 40శాతానికి తగ్గించినందుకుగాను శుక్రవారం మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వికలాంగ సంఘాల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. నాయకులు రాజేందర్, షఫి, మల్లికార్జున్, బెస్త యాదగిరి, రాజశేఖర్, అడ్డా రాజు, ప్రవీణ, విజయసింహారెడ్డి, మధు, రవి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బీజేవైఎం నేత ఆత్మహత్య

చాదర్‌ఘాట్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో బీజేవైఎం నేత తన ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల ప్రకారం.. మూసారాంబాగ్ నివాసి డివిజన్ బీజేవైఎం నేత పి.సందీప్‌యాదవ్(28) గురువారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చాడు. అనంతరం కుటుంబీకులతో కలిసి నిద్రించాడు. శుక్రవారం ఉదయం కుటుంబీకులు చూసే సరికి మృతిచెంది ఉన్నట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి శవపరీక్ష చేయగా పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బయటపడింది. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ ఇప్పించడం లేదని కూలీ ఆత్మహత్య

హయత్‌నగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇంట్లో అందరు స్మార్ట్ ఫోన్ వాడుతారు.. నాకు మాత్రం డబ్బా ఫోను ఇస్తారా అంటూ తీవ్ర మనస్థాపానికి గురైఓ వ్యక్తి చీరతో ఫ్యానుకు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. భాగ్యలత శాంతినగర్‌కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న బోయ శ్రీను(43) కూలీ పని చేస్తాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉంది. ఇంట్లోని అందరు స్మార్ట్‌ఫోన్‌లు వాడుతున్నారు. శ్రీను మాత్రం చిన్న ఫోన్ వాడుతున్నాడు. కొన్ని రోజులుగా శ్రీను స్మార్ట్‌ఫోన్ కావాలని ఇంట్లో గొడవ పడుతున్నాడు. ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. వారం రోజులు ఆగు ఫోన్ కొనిపిస్తామని భార్య చెప్పింది. అయినా వినకుండ మనస్థాపానికి గురైన శ్రీను గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.